పాత కక్షలతో తండ్రీకొడుకుపై కత్తితో దాడి

అందోల్, నవంబర్ 3: పాత కక్షలతో తండ్రీకొడుకుపై దాడికి యత్నించిన ఘటన మండల పరిధిలోని అల్మాయిపేట్‌లో ఆదివారం చోటుచేసుకుంది. జోగిపేట ఎస్సై పాండు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బత్తిని ఆగమయ్య, అతడి కొడుకు బత్తిని వెంకట్‌కు దూరపు బంధువైన కోహీర్ మండలం దిగ్వాల్‌కి చెందిన బత్తిని నాగేశ్‌తో పాత కక్షలున్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని ఆదివారం అల్మాయిపేట్‌కు వచ్చిన నాగేశ్ ఆగమయ్య ఇంట్లోనే నిద్రపోయాడు. అందరూ పడుకున్నాక ప్లాన్ ప్రకారం వెంట తెచ్చుకున్న కత్తితో తండ్రీకొడుకుపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారు పెద్దగా కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకోవడంతో నిందితుడు పారిపోయాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అల్మాయిపేట్‌కు వచ్చి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారులపై ధాన్యాన్ని ఆరబోయొద్దు

పుల్కల్, నవంబర్ 3: వానకాలం సీజన్ వరి ధాన్యాన్ని కళ్లాల్లోనే ఆరబెట్టుకోవాలని, రోడ్లపై ఆరబెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్లపై వరిధాన్యాన్ని ఆరబెడితే ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దని కోరారు.

ఇండ్లు కట్టారు.. వదిలేశారు

- పుల్కల్‌లో పంపిణీకి నోచుకోని ఇండ్లు
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా సముదాయం

పుల్కల్‌లో నిరుపయోగంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లు

పుల్కల్, నవంబర్ 3: పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి పుల్కల్ మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీకి నోచుకోవడం లేదు. పుల్కల్‌లో 48 డబుల్ బెడ్‌రూం ఇండ్లను బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2.42 కోట్లు ఖర్చుచేసి నిర్మించింది.ఒక్కో యూనిట్‌కు రూ.5.04 లక్షలు ఖర్చుచేసింది. నాలుగు బ్లాక్‌ల్లో, ఒక్కో బ్లాక్‌కు 12 ఇండ్ల చొప్పున నిర్మించింది. ఏడాది క్రితమే లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. కానీ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రావడంతో లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి ఇండ్ల ప్రవేశాలె చేయించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తోంది. కానీ, డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీకి మోక్షం లభించడం లేదు. దీంతో డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిరుపయోగంగా మారాయి. అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రిళ్లు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. ఆకతాయిలు డోర్లు, కిటికీలను పగుల గొట్టారు. కరెంటు మీటర్లు, వైర్లను సైతం ఎత్తు కెళ్లారు. దీంతో ఇండ్లు దెబ్బతినడంతో పాటు ప్రజాధనం వృథా అవుతున్నది. త్వరగా పట్టాలు ఇస్తే గృహప్రవేశాలు చేస్తామని, మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇండ్ల సముదాయంలో పశువుల పేడ

పగిలిన కిటికీ అద్దాలు

ఎంసీబీలు ఎత్తుకెళ్లిన దృశ్యం

డబుల్ బెడ్‌రూం ఇండ్ల ముందర పడేసిన బోర్డు

ఇండ్లను పంపిణీ చేయాలి

డబుల్ బెడ్‌రూం ఇండ్లను త్వరగా అప్పగించాలి. రాజకీయ పలుకుబడితో కాకుండా అధికారులు గ్రామసభ నిర్వహించి అర్హులను గ్రామస్తుల సమక్షంలో అప్పగించాలి. ఇండ్లు కట్టి ఏడాది పూర్తవుతున్నది. శిథిలావస్థకు చేరుతున్నాయి. పూర్తిగా పాడుబడక ముందే మాకు ఇండ్లను అప్పగించాలి.

\- అవుసలి విజయలక్ష్మి, లబ్ధిదారు, పుల్కల్

ప్రభుత్వం దృష్టిసారించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నది. అయినా ఇండ్ల పంపిణీపై సప్పుడు చేయడం లేదు. మాకు ఉండడానికి ఇల్లు లేదు. తీవ్ర ఇబ్బందుల నడుమ పిల్లలతో కలిసి కిరాయి ఇంటిలో ఉంటున్నం. ఇంటి అద్దె భారంగా మారింది. ప్రభుత్వం త్వరగా ఇండ్లను కేటాయిస్తే ఇబ్బందులు తీరుతాయి.

\- కంబాలపల్లి చెన్నయ్య, లబ్ధిదారుడు, పుల్కల్

పూజకు వెళ్లి వచ్చేలోగా ఇల్లు గుల్ల

- రెండు ఇండ్లలో భారీ చోరీ
- 31 తులాల బంగారం, 15 తులాల వెండి, రూ.19 వేల నగదు అపహరణ

గుమ్మడిదల, నవంబర్ 3: గుమ్మడిదలలో ఆదివారం భారీ చోరీ జరిగింది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి బాధితులు తెలిపిన వివరాల మేరకు. గుమ్మడిదల గ్రామానికి చెందిన చిమ్ముల రవీందర్‌రెడ్డి, భార్య రజిత బంధువుల ఇంట్లో సత్యనారాయణ వ్రతం ఉండడంతో ఇంటికి తాళం వేసి వెళ్లారు. వ్రతం ముగించుకొని ఇంటికి తిరిగి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి బీరువా చూడగా 31 తులాల బంగారం, 10 తులాల వెండి, నాలుగు వేల నగదు చోరీ జరిగినట్లు బాధితులు గుర్తించారు. అలాగే గుమ్మడిదలకు చెందిన శ్రీనివాస్‌నాయక్ జిన్నారంలోని హాస్టల్‌లో ఉంటున్న తన కూతురు వద్దకు మధ్యాహ్నం వెళ్లి ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగింది. ఇట్లో నుంచి 5 తులాల వెండి, 15వేల నగదు చోరీ జరిగినట్లు బాధితుడు శ్రీనివాస్‌నాయక్ గుర్తించారు. గంట వ్యవదిలో రెండు ఇండ్లల్లో చోరీ జరగడంతో గుమ్మడిదలలో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. చోరీ జరిగిన ఇండ్లను అదనపు ఎస్పీ సంజీవరావు, జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీని సేకరించి దర్యాప్తు చేపట్టారు.

అందుబాటులో ట్రాన్స్‌కో సిబ్బంది

అందోల్, నవంబర్ 3: విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అన్నాసాగర్ ట్రాన్స్‌కో కార్యాలయంలో రైతులు, విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ట్రాన్స్‌కో సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని, వారి సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్త కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ఇతరత్రా అవసరాలకు ఒక్క ఫోన్ కాల్ చేస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. పొలాలు, ఇండ్ల వద్ద విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని, ఏమైనా సాంకేతిక లోపాలుంటే సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. సొంతంగా రిపేర్లు చేయకూడదన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది, రైతులు ఉన్నారు.

అందోల్: మాట్లాడుతున్న ఏఈ శ్రీనివాస్

గుమ్మడిదల: మాట్లాడుతున్న ఏడీఏ దుర్గాప్రసాద్

స్నేహపూర్వకంగా ఉండాలి

గుమ్మడిదల, నవంబర్ 3: మండల కేంద్రంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో ఏడీఏ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం సబ్‌డివిజన్ కార్యాలయంలో ఏడీఏ దుర్గాప్రసాద్ రైతులతో కలిసి వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం దిశగా విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలున్నా విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. విద్యుత్‌ను ప్రతి వినియోగదారుడు పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, అర్హులైన గృహాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బొంతపల్లి, జిన్నారం ఏఈలు రవీందర్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో కార్తిక సందడి

గుమ్మడిదల, నవంబర్ 3: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో కార్తికమాస పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని వీరన్నగూడెంలోని వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో దైవదర్శనాలకు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. వీరభద్రస్వామి వారికి అభిషేకాలు, భద్రకాళీ అమ్మవారికి కుంకుమార్చనలు, సామూహికంగా సత్య నారాయణ వ్రతాలు ఆచరించారు. వీరభద్రప్రస్తాయాలు, రుద్రాభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య పర్యవేక్షణలో భక్తులు దైవదర్శనాలు చేసుకున్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

కార్పొరేషన్‌తో ఆర్యవైశ్యులకు సహకారం

సంగారెడ్డి, నవంబర్ 3: ప్రభుత్వం ఆర్య వైశ్య కార్పొరేషన్‌తో పేద వైశ్యులకు సహకారం అందిస్తామని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత అన్నారు. ఆదివారం సంగారెడ్డిలోని వాసవి కన్యాకా పరమేశ్వరి ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు తాము ముందుండి పోరాటం చేశానని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇవ్వని హామీని అమలు చేసిందన్నారు. ఈ నెల 8న కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారానికి సికింద్రాబాద్ నుంచి ఆరణ్య భవన్ వరకు నిర్వహించే ర్యాలీకి ఆర్య వైశ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఆర్యవైశ్యుల బలం చూపితే ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. వైఎస్ఆర్ హయాంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాలను దేవాదాయశాఖ నుంచి మినహాయిస్తూ జీవో ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీటీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంతకిషన్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు మాణిక్ ప్రభు, కోశాధికారి చంద్రశేఖర్, కేయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు యాదగిరి, మార్కెట్ కమిటీ సభ్యులు బుచ్చిలింగం, ఆర్యవైశ్య మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి తోపాజి తేజవతి, జిల్లా అధ్యక్షురాలు రజని, యువజన విభాగం అధ్యక్షుడు హరీష్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

పట్టణ నూతన కార్యవర్గం ప్రమాణం

సంగారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. పట్టణ అధ్యక్షునిగా విద్యాసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పూర్ణచందర్, కార్యదర్శిగా నామ భాస్కర్, కోశాధికారిగా ఆమెటి భాస్కర్, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

ఉమ్రా యాత్రకు వెళ్తున్న ముస్లింలకు సన్మానం

ముస్లింలను సన్మానిస్తున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, నవంబర్ 3: పవిత్రమైన ఉమ్రా యాత్రకు వెళ్తున్న ముస్లింలకు జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యాత్రకు వెళ్తున్న ముస్లింలకు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గంలో పాడిపంటలు బాగా పండి ప్రజలుందరూ సుఖసంతోషాలతో గడిపేలా ప్రత్యేక ప్రార్థనలు చేయాలని ముస్లింలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాకుబ్, అలీ, జుబేర్, నారాయణ, జాకీర్, ఫయాజ్, ఫాహిమ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఝరాసంగం, నవంబర్ 3: మండల పరిధిలోని కుప్పానగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2013-14 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఇన్ని సంవత్సారాల తర్వాత నాటి స్నేహితులను కలుసుకొని ఒకరినోకరు ఆత్మీయంగా పలుకరించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి అధ్యాపకులకు శాలువా, మెమెంటోలతో సన్మానించి ఆశీర్వచనలు తీసుకున్నారు. ఉపాధ్యాయులు శరణప్ప, శశిధర్, గోపాల్, జోయల్ ఇమ్మానియన్, నర్సింలు, ప్రానూతి, కనకరాజ్ పాల్గొన్నారు.

కష్టపడితే ఫలితం తథ్యం

ఎస్‌జీటీ టీచర్ శివకుమార్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, నవంబర్ 3: మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన శివకుమార్ పలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు. ఇటీవల ఎస్‌జీటీ టీచర్ ఉద్యోగం సాధించాడు. దీంతో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అతడిని అభినందించారు. ఈమేరకు శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి చదివిన వారికి ఎప్పటికైనా చక్కటి ఫలితం వస్తుందని చెప్పారు. ఈయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, కౌన్సిలర్ స్వప్న అభిషేక్ షెట్కార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగేశ్, సాయియాదవ్, అబ్బు పటేల్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సిర్గాపూర్, నవంబర్ 3: మండల పరిధిలోని ఉజలంపాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రమేశ్ తల్లి భూమవ్వ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందింది. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనవెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు మొగులప్ప, కిందిదొడ్డి విఠల్, గుండప్ప, రమేశ్, మోహన్, నాగేశ్, బాలప్ప, కిషన్, లింగప్ప తదితరులు ఉన్నారు.

ధార్మిక కార్యక్రమాలతో ఉన్నత స్థితి

నాగల్‌గిద్ద, నవంబర్ 3: ధార్మిక కార్యక్రమాల ద్వారా మానవజన్మకు సార్థకత లభించి ఉన్నత స్థితికి చేరుకుంటారని బిచ్కుంద పీఠాధిపతి శివానంద శివాచార్య మహరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని మావినెల్లి గ్రామంలోని భాగ్యవతి అమ్మవారు ఆలయంలోని విగ్రహ, శిఖరమును ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని నిర్వాహకులు, గ్రామస్తుడు సంగమేశ్వర్ మహరాజ్ శాలువతో ఘనంగా సన్మానించారు.

చర్చి నిర్మాణానికి సాయం

జిన్నారం, నవంబర్ 3: మాదారం గ్రామంలో నిర్మించే చర్చికి కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రాజుగౌడ్ ఆర్థిక సాయం చేశారు. ఆదివారం చర్చి నిర్మాణానికి సంబంధించి రూ.35 వేల నగదును కాంగ్రెస్ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయంలో నిర్వాహకులకు అందజేశారు.

బగళాముఖికి పూజలు

గుమ్మడిదల, నవంబర్ 3: బగళాముఖి అమ్మవారి సన్నిధిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పూజలు నిర్వహించారు. కార్తిక మాసం ఆదివారం శివ్వంపేట మండల కేంద్రంలోని శక్తిపీఠం బగళాముఖి అమ్మవారి సన్నిధిలో గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ పబ్బం మహేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్ పాల్గొన్నారు.

అద్దె బస్సుల చార్జీలు తగ్గింపు

జహీరాబాద్, నవంబర్ 3: పెండ్లిళ్లు, శుభకార్యాలు, విహార యాత్రలకు అద్దెకు తీసుకునే ఆర్టీసీ బస్సుల ఛార్జీలను సంస్థ భారీగా తగ్గించిందని జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్ పేర్కొన్నారు. టీఎస్‌ఆర్టీసీ గతంలోకంటే ఈసారి అద్దె బస్సుల ఛార్జీలను భారీగా తగ్గించిందన్నారు. పల్లె వెలుగు బస్సుకు కి.మీ.కు రూ.11లు, ఎక్స్‌ప్రెస్‌కు రూ.7లు, డీలక్స్ బస్సుకు రూ.8, సూపర్ లగ్జరీకి రూ.6ల మేర ఛార్జీలను తగ్గించినట్టు వివరించారు. అయ్యప్ప స్వాముల శబరిమల యాత్రకు ప్రత్యేక బస్సులను నడుపుతామన్నారు. విహార యాత్రలకు వెళ్లే విద్యార్థుల కోసం 10 శాతం రాయితీ కల్పిస్తున్నామన్నారు. అదనపు సమాచారం కోసం డిపో మేనేజర్ ఫోన్ నంబర్ 99592 26269, అసిస్టెంట్ మేనేజర్ ఫోన్ నంబర్ 94940 93486, బుకింగ్ ఇన్‌చార్జి ఫోన్ నంబర్ 98498 89912లలో సంప్రదించాలన్నారు.

ఖాతాదారుల సేవా కేంద్రం ప్రారంభం

ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో అంజయ్య

రాయికోడ్, నవంబర్ 3: గ్రామీణ ప్రాంతాల్లో తమ అవసరాల నిమిత్తం బ్యాంకుల నుంచి ఎలాంటి ఇబ్బంది లేకుండా డబ్బులు తీసుకునేందుకు ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని మండల విద్యాధికారి అంజయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో భారతీయ స్టేట్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖాతాదారుల సేవ కేంద్రన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆసరా పింఛన్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకునే సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నిర్వాహకులు గువ్వ గోపాల్ ముదిరాజు, వరం వైస్ చైర్మన్ తుకారంకురుమ, మాజీ సర్పంచ్ నాగార్జున, నాయకులు రవి ఉన్నారు.

పాఠశాలకు ఆట వస్తువులు బహూకరణ

బొల్లారం, నవంబర్ 3: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఎన్జీవోల సహాయ సహకారాలు మరువలేనివని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అంజయ్య అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను నగరానికి చెందిన బెస్ట్ రన్నర్ ఎన్జీవో సంస్థ ప్రతినిధులు సందర్శించి పేద విద్యార్థులకు అవసరమైన ఆట వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం అంజయ్య ఎన్జీవో ప్రతినిధులను ఘనంగా సన్మానించి వారి సహకారానికి ధన్యవాదాలు తెలిపారు.

ఆత్మరక్షణకు కర్రసాము

సంగారెడ్డి, నవంబర్ 3: కర్రసాము నేటి తరం యువతకు ఎంతో అవసరమని వేద సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ రమేశ్ మాస్టర్ అన్నారు. ఆదివారం పట్టణంలో కలెక్టరేట్ వెనకాల ఉన్న పార్కులో తొలిసారిగా కర్రసాము శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు కర్రసాము ఫెడరేషన్ ఇండియా తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ వినోద్ మాస్టర్ హైదరాబాద్ నుంచి వచ్చారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో కర్రసాము నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు సీనియర్ మాస్టర్లు అశోక్, వినయ్‌కుమార్, కళ్యాణ్, ప్రభు పాల్గొన్నారు.

బైక్ ఢీ కొట్టిన ఘటనలో మహిళ మృతి

చంద్రకళ (ఫైల్)

రామచంద్రాపురం, నవంబర్ 3: 65వ జాతీయ రహదారి దాటుతున్న మహిళను బైక్ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్ఐజీ రామచంద్రాపురానికి చెందిన చంద్రకళ(50) శనివారం నడుచుకుంటూ డైమాండ్ పాయింట్ దగ్గరలోని టాటా మోటార్స్ జాస్పర్ ఇండస్ట్రీస్ ఎదురుగా జాతీయ రహదారి దాటుతున్నది. అదే సమయంలో పటాన్‌చెరు నుంచి జావా బబ్బర్(TS15FM 1050) బైక్ వేగంగా వచ్చి యూటర్న్ తీసుకొని మహిళను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె తీవ్ర గాయాలు కాగా, గమనించిన స్థానికులు వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు ఆటోలో తరలించారు. అనంతరం ఆమె కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దవాఖనాకు చేరుకున్న కుమారుడు అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు దవాఖానకు తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందింది. తన తల్లి మృతికి కారణమైన బైక్ నడిపిన వ్యక్తి పటాన్‌చెరు అంబేద్కర్ కాలనీకి చెందిన షేక్ షఫీ అని తెలుసుకున్నాడు. అతడిపై పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం


సంగారెడ్డి: కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ మాణిక్యం

సంగారెడ్డి, నవంబర్ 3: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ధాన్యం నింపడానికి సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు. అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ధాన్యాన్ని తీసుకువచ్చిన వెంటనే తూకం వేసి వాహనాలు వరుసగా నిలబెట్టకుండా త్వరగా పంపించే ఏర్పాట్లు చేయాలన్నారు. పెద్ద మార్కెట్‌లలో ధాన్యం ఆరబెట్టడానికి, వడ్ల కుప్పలు వేసేందుకు స్థలాలు ఉంటాయని, అక్కడ ఎలాంటి సమస్యలు రావవన్నారు. ఇక్కడ రైతులు అధికారులపై ఫిర్యాదులు చేయకుండా ఉంటేనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి

గుమ్మడిదల, నవంబర్ 3: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులపై ఎలాంటి ఆంక్షలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ సర్కారు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతులు పండించిన ప్రతిగింజనూ కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన వారంలో బ్యాంకు ఖాతాలో నగదు జమ చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేసి వారంలోగా రైతుల బ్యాంకు ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి ఆపద వచ్చినా బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు. సన్న ధాన్యానికి బోనస్ తప్పనిసరి ఇవ్వాలని ఆంక్షలు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల పేరుతో రాష్ట్ర ప్రజలను నట్టేటా ముంచిన కాంగ్రెస్ సర్కారు రైతులను కూడా మోసం చేస్తే ఉద్యమం తప్పదన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

జిన్నారం, నవంబర్ 3: జిన్నారం, వావిలాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ భిక్షపతి ఆదివారం పరిశీలించారు. అక్కడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మ్యాచర్‌కు మిక్స్ అయ్యే ధాన్యం వెంటవెంటనే కాంటా పెట్టాలని సిబ్బందికి సూచించారు. క్లీనింగ్ మిషన్‌లో వడ్లు వేయాలని కొత్తగా తీసుకొచ్చిన మిషన్‌తో తమకు పనిభారం పెరుగుతుందని రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోకుండా సరిపడా కవర్లు అందుబాటులో ఉండేలా చేసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఐకేపీ ఏపీఎం నరేందర్, వీవో సుజాత, లత పాల్గొన్నారు.

అందోల్‌లో..

అందోల్, నవంబర్ 3: మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం అడిషనల్ డీఆర్డీవో జంగారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ధాన్యం ఏ గ్రేడ్‌కు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర ఉందని తెలిపారు. కొన్న ధాన్యాన్ని సిబ్బంది వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఏపీఎం మాణిక్యం, సీసీ మమత, వీఓఏ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

హత్నూర, నవంబర్ 3: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్డీవో జ్యోతి సూచించారు. ఆదివారం హత్నూరలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె వెంట డీపీఎం జయశ్రీ, ఏపీఎం దేవేందర్, సీసీ మహేశ్, నాగరాణి, వీవోఏ లక్ష్మయ్య, జ్యోతి, ఏఈవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.